క్లుప్తంగా

ఘనంగా సామూహిక సీమంతాలు



గర్భిణులను సత్కరిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని పది అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన గర్భిణులకు గురువారం సామూహిక సీమంతాలు చేశారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ వంశీరెడ్డి హాజరై గర్భిణులను సత్కరించి, చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ సీడీపీవో నీలవేణి, పెదగంట్యాడ సూపర్‌వైజర్ కనకమహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల ఆశ్రమానికి సరకుల వితరణ



సరకులను అందిస్తున్న ధ్యానకేంద్రం ప్రతినిధులు

పెదగంట్యాడ: వినాయక పిరమిడ్ ధ్యాన కేంద్రం వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కేంద్రం నిర్వాహకురాలు జయలక్ష్మి ఆధ్వర్యంలో కర్ణవానిపాలెంలోని స్ఫూర్తి నిరాధార చారిటబుల్ ట్రస్ట్ (బాలల ఆశ్రమం), జనరేషన్ యువ చారిటబుల్ ట్రస్ట్‌లకు నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం చిన్నారులతో ధ్యానం చేయించారు. ధ్యానం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో రామరాజు, డాక్టర్ జీఎస్సార్, లత, కృష్ణ, శ్రీను, సురేష్, శ్రీహర్ష, రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌కు అభినందనలు



డైరెక్టర్ పాండేను అభినందిస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) సురేష్ కుమార్ పాండేను ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు అభినందించారు. నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు ఆయన్ను కలిసి, సత్కరించారు. సుదీర్ఘ కాలం సెయిల్ ఉన్నతాధికారిగా పని చేసిన అనుభవంతో ఉక్కు అధికారుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, లోకేష్, పి.ఈశ్వరరావు, టి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వ్యాకరణంపై శిక్షణ



విజ్ఞాన, వినోద కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

గాజువాక: గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు గురువారం వినోదాత్మక, జ్ఞానాన్ని పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ రవి, గ్రంథాలయాధికారి బి.చంద్రకళ ఆధ్వర్యంలో చిన్నారులకు తెలుగు భాష గొప్పతనం, వ్యాకరణం అంశాలను వివరించారు. భాషను స్పష్టంగా పలకడం, మాట్లాడటం, తప్పుగా పలికినప్పుడు భాష అర్థాలు మారిపోవడం వంటి విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం తెలుగు పదాలపై అంత్యాక్షరిని ఆడించి, పాటలను పాడించారు. కార్యక్రమంలో చిన్నారులు ఆసక్తిగా పాల్గొన్నారు.

కళ తప్పిన 'భెల్' క్వార్టర్లు

- తుప్పల మధ్య దుర్భర జీవనం
- గోతులమయంగా రోడ్లు
- సమస్యలతో కార్మికుల కుటుంబాలు సతమతం



తుప్పల మధ్య నుంచే రాకపోకలకు మార్గం



తుప్పల మధ్య నిరుపయోగంగా క్వార్టర్లు



గోతులమయమైన రోడ్లు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) టౌన్‌షిప్‌లో క్వార్టర్లు అధ్వానంగా మారడంతో అక్కడ నివసిస్తున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్లు తుప్పల మధ్య నివాసాలు, ఇరుపక్కల తుప్పలతో మూసుకుపోయిన ఇరుకైన రోడ్లు, గోతుల మయమైన రహదారులతో అవస్థలు పడుతున్నారు. పాములు, విషకీటకాలతో నిత్యం బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నామని చెప్పారు. పందులు, కుక్కల సంచారం కూడా ఎక్కువ కావడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. నవరత్న కంపెనీగా ఉన్న భెల్ విశాఖపట్నం యూనిట్‌లో సుమారు 800 మంది అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో పాటు 250 మంది వరకు కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు. వీరిలో చాలామందికి సంస్థ టౌన్‌షిప్‌లో క్వార్టర్లను కేటాయించారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికుల వారీగా ఏ, బీ, సీ, ఈ, ఎఫ్ విభాగాలుగా ఉన్న టౌన్ షిప్‌లో 1100 నివాసాలు ఉండేవి. చాలా వరకు క్వార్టర్లు శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం 300 నివాసాలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. సీ టైప్ క్వార్టర్ పూర్తిగా మూతపడింది.

ఏదీ నాటి వైభవం?

ఒకప్పుడు బీహెచ్‌పీవీగా ఉన్న సమయంలో బీహెచ్‌పీవీ క్వార్టర్స్ అంటే పెట్టింది పేరు. అందమైన రోడ్లు, పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణంతో ఎంతో సందడిగా ఉండేది. క్రమంగా కళావిహీనంగా మారింది.

ప్రధాన సమస్యలివీ..

- క్వార్టర్లలో చాలావరకు వినియోగంలో లేకపోవడంతో తుప్పలు పేరుకుపోయి, భయం గొల్పుతున్నాయి.
- తుప్పల మధ్య నివాసాలు ఉండటంతో పాములు, విషకీటకాల మధ్య నివాసితులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.
- క్వార్టర్లలో అధికారుల నివాసాల మధ్య తప్ప మిగిలిన అన్ని ప్రాంతాల్లో రహదారులన్నీ గోతులమయంగా మారాయి. కొన్ని చోట్ల రోడ్డుకు ఇరుపక్కలా తుప్పలు పేరుకుపోవడంతో రాకపోకలకు కూడా ఇబ్బందికరంగా మారింది.
- నివాసాల మధ్య పందుల సంచారం ఎక్కువగా ఉంటోంది. క్వార్టర్లలో నివాసాల మధ్య చెత్తకుప్పలు పేరుకుపోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి.
- టౌన్‌షిప్‌లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ వాహనచోదకులపై దాడి చేస్తుండడంతో వారు హడలిపోతున్నారు. రాత్రివేళల్లో కంటిపై కునుకు ఉండటం లేదని స్థానికులు చెబుతున్నారు.
- క్వార్టర్లు తుప్పల మధ్య ఉండడం, జనసంచారం తక్కువగా ఉండడంతో దొంగతనాలు జోరుగా జరుగుతున్నాయి. ఇటీవల దొంగలు రెండు సార్లు క్వార్టర్లలో ప్రవేశించి, హల్‌చల్ చేశారని నివాసితులు చెబుతున్నారు. టౌన్‌షిప్‌లో సెక్యూరిటీ తిరగకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని వాపోతున్నారు.
- క్వార్టర్లలో పారిశుధ్య నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంటోంది. క్వార్టర్ల అభివృద్ధికి ప్రత్యేక విభాగం ఉన్నా, పేరుకు మాత్రమే అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల మధ్యనే జీవిస్తున్నా, పైకి వ్యక్తం చేయడానికి కూడా కార్మికులు వెనకడుగు వేస్తున్నారు.



నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పీఎం పాలెంలోని స్టేడియం హెలిప్యాడ్ వద్ద పుష్ప గుచ్ఛం అందించి ఆత్మీయ స్వాగతం పలికారు.

చెరువులో అనధికారికంగా చేపల పెంపకం



చెరువు నీటిని మూడు పంపులతో బయటకు తోడి, వృథా చేస్తున్న దృశ్యం

- నీటిని మూడు మోటార్లతో తోడేస్తున్న వైనం
- స్థానిక రైతులు వాడే వీలు లేకుండా కట్టడి
- రెండేళ్లుగా ఇదే తీరు
- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని అధికారులు

అగనంపూడి: చేపల పెంపకం కోసం చెరువును అక్రమంగా వాడుతున్నారు. అంతే కాదు, చెరువులోని నీటిని మూడు పంపులతో తోడుతూ బయటికి పారబోస్తుండడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల నుంచి పలు విభాగాల అధికారులకు ఫిర్యాదు చేసినా తమ పరిధిలో విషయం కాదంటూ కప్పదాటుగా వ్యవహరిస్తూ, వ్యాపారికి తోడ్పాటునందిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు.

వివరాలివి..

గాజువాక మండలం, జీవీఎంసీ 88వ వార్డు కాపుజగ్గరాజుపేట సర్వే నంబర్ 67లో ఏడు ఎకరాల చెరువు (అయ్యప్ప చెరువు) ఉంది. ఈ చెరువులో రాజమండ్రి ప్రాంతానికి చెందిన ఒక చేపల పెంపకందారు రెండేళ్ల నుంచి చేపలను అనధికారికంగా పెంచుతున్నారు. సంబంధిత అధికారులు, గ్రామస్తుల అనుమతి లేకుండా గ్రామానికి చెందిన చెరువులో చేపల పెంపకం చేయడం ఒక ఎత్తు



కాపుజగ్గరాజుపేటలోని అయ్యప్ప చెరువు

అయితే, చేపల వేట కోసం చెరువులో నీటిని రేయింబవళ్లు మూడు పంపులతో నిరంతరం తోడుతూ బయటికి వృథాగా నీటిని వదిలేస్తుండడంతో ఆ పరిధిలోని ఆయకట్టుతో పాటు మంచినీటి ఎద్దడి ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి కాలుష్యం ఏర్పడుతుందని, స్థానికులు చెరువులో పశువులను వదలడంతో పాటు స్థానికులు వాడుకునే వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు ఒకరి ఆధీనంలోకి వెళ్లిపోవడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అధికారులకు ఫిర్యాదు

ఈ విషయంపై స్థానికులు ఇప్పటికే గాజువాక తహసీల్దార్, ఇరిగేషన్, జీవీఎంసీతో పాటు ఇతర అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. అయినా చేపల పెంపకం, నీటిని తోడడం ఆగలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కలగజేసుకొని అనధికారిక చేపల పెంపకం, నీటి వృథా ఆపేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఫైలేరియాపై అవగాహన



రోగులకు మందులు, సబ్బులు పంపిణీ చేస్తున్న వడ్లపూడి యాంటీ మలేరియా విభాగ సిబ్బంది

కూర్మన్నపాలెం: ఫైలేరియా వ్యాధిని నిర్మూలించేందుకు వైద్యశాఖ సమష్టి కృషితో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని డాక్టర్ సుధాకర్ అన్నారు. ఫైలేరియా నియంత్రణ కార్యక్రమంలో భాగంగా బోదకాలు వ్యాధిగ్రస్తులకు మందులు, సబ్బులు, టవల్స్, టబ్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలు ప్రబలకుండా చూసుకోవాలని, దోమ తెరలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో బాబీ, వడ్లపూడి యాంటీ మలేరియా విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పెదగంట్యాడ పీహెచ్‌సీ సిబ్బంది

అవగాహన ర్యాలీ

పెదగంట్యాడ: దోమ కాటు కారణంగా బోదకాలు వ్యాధి వస్తుందని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫైలేరియా వ్యాధిపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోదకాలు వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణల గురించి వివరించారు. బోదకాలును ఎలా శుభ్రం చేయాలో మలేరియా సిబ్బంది చేసి చూపించారు. ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, సిద్దేశ్వరం వైద్యాధికారి డాక్టర్ మానస, డాక్టర్ చక్రధర్, ఏఎంవో సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

జోన్-6 కు కొత్త డంపర్‌బిన్లు

పెదగంట్యాడ: జీవీఎంసీ జోన్-6 జోనల్ కార్యాలయ పరిధిలో పారిశుధ్య నిర్వహణ కోసం కొత్తగా డంపర్ బిన్లు వచ్చాయని ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. డంపింగ్ యార్డ్‌కు వచ్చిన వీటిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంపాక్టర్ బిన్స్ 12, డంపర్ బిన్లు 13, పోర్‌టబ్ పుష్ కార్ట్స్ 110, టూ టబ్ పుష్ కార్ట్స్ 50, వీల్ బారోస్ 20 వచ్చాయని తెలిపారు. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో పరిశీలించి, వాటిని అక్కడ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పుష్ కార్ట్స్‌ను పారిశుధ్య కార్మికులకు అందజేస్తామన్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయవద్దని ప్రజలను కోరారు. ఇళ్లలో, వాణిజ్య సముదాయాలకు చెందిన చెత్తను డంపర్ బిన్లలో వేయాలని సూచించారు.



డంపింగ్ యార్డ్‌లో ఉంచిన కొత్త డంపర్‌బిన్లు

నేటి నుంచి ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై శిక్షణ

సీతమ్మధార: వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు బాల వికాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి ఐదు రోజుల పాటు ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం గురువాయూరప్పన్ ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఉంటుంది. 14 నుంచి 40 ఏళ్ల వయసు గల బాలికలు, మహిళలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. వివరాలకు 85200 04288 నంబర్‌లో సంప్రదించవచ్చు.

నిర్వాసితులకు 50శాతం అవకాశం కల్పించాలి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న పైడిరాజు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ ఉపాధిలో 50 శాతం నిర్వాసితులకు ఇవ్వాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్లాంట్‌లో నిర్వాసితులకు 50 శాతం ఉపాధి కల్పించగా, ప్రస్తుతం పోస్టుల్లో వారిని తీసుకోవడం లేదన్నారు. ఉక్కు కార్మికులకు వెంటనే వేతన ఒప్పందం చేయాలన్నారు. పెదగంట్యాడ ఆసుపత్రిలో రాత్రి వేళ వైద్యులు లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కరణం సత్యారావు, పంచదార్ల పెంటారావు, బాలాజీ, ఎం. మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధి వెంకన్నపాలెంలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే ఉపకరణాలు కాలిపోతున్నాయని ఫిర్యాదులు అందడంతో కొత్తగా రూ.6.50 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 64వ వార్డు పార్టీ అధ్యక్షుడు ధర్మాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పట్టని కేంద్ర ప్రభుత్వం



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికులు పడుతున్న సమస్యలు కేంద్ర ప్రభుత్వానికి పట్టవా అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 819వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2 విభాగానికి చెందిన కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు నేటికీ దీనస్థితిలో ఉన్నాయని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటేనే మంచిదని అన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించాలని, లేదంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

సింహాచలం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తుందని డీఈవో చంద్రకళ అన్నారు. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన జగనన్న విద్యా కానుక కిట్స్ స్టాక్ పాయింట్‌ను గురువారం ఆమె పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత ఎలాంటి ఆటంకం లేకుండా కిట్స్ పంపిణీ చేయాలని సూచించారు. పాఠశాలల వారీగా విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన జేవీ కిట్లు వివరాలతో రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని సూచించారు. తదుపరి నాడు-నేడు రెండో దశలో ఎంపికైన పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జుత్తాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నరవ వానిపాలెం, దువ్వపాలెం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, పులగాలిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. నరవానిపాలెం పాఠశాలలో వుయ్ లవ్‌రీడింగ్‌లో భాగంగా సమ్మర్ క్యాంప్ యాక్టివిటీస్, బుక్స్ పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అలాగే పది కాంపోనెంట్స్ పనులను జూన్ 11లో పూర్తి చేయాలని మండల విద్యా శాఖాధికారి పైడపు నాయుడును ఆదేశించారు. ఎంఈవో పైడపునాయుడు మాట్లాడుతూ పెందుర్తి మండలానికి తొలి విడతగా పాఠ్యపుస్తకాలు 19,435, నోట్ పుస్తకాలు, 59,086 వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాడు-నేడు ఫీల్డ్ ఇంజినీర్ పి.పద్మ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సునీల్, బి.హరికృష్ణ, కె.రవికుమార్, ఎడ్యుకేషన్ సెక్రటరీ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న రెక్టార్ మధుసూదనరావు, ప్రిన్సిపాల్ సుధాకర్

అగనంపూడి: జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్‌టీఎల్, డీఆర్‌డీవో సంయుక్తంగా నిర్వహించిన ప్రాజెక్టు ఎక్స్‌పోలో దువ్వాడ విజ్ఞాన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. బి.సత్య సాహి, యశ్వంత్ సాయి, తేజ ప్రదర్శించిన రియల్ టైం రికగ్నైజేషన్ అమెరికన్ సైన్స్ లాంగ్వేజ్, ఐవోటీ ఎనేబుల్డ్ గ్యాస్ లీకింగ్ డిటెక్టర్ ప్రదర్శనలకు గాను ఈ బహుమతులు దక్కాయి. వారిని రెక్టార్ వి.మధుసూదనరావు, సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ పి.వి.రవీంద్ర తదితరులు అభినందించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



స్వర్ణపుష్పాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈపూజ నిర్వహించారు. ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మనిషి కవి గోపి

సీతంపేట: కవిత్వం అంటే మనిషిని కలిసినట్టు ఉండాలని భావించే మహోన్నత వ్యక్తి, ప్రముఖ కవి, విమర్శకుడు ఎన్.గోపి అని పలువురు వక్తలు కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జగదీశ్వరి ఫౌండేషన్ 2020 సాహిత్య పురస్కారం ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథి రచయిత వి.హర్షవర్ధన్ చేతుల మీదుగా కవి గోపికి జగదీశ్వరి పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ మనిషి కవి గోపి అని, ఆయన రాసిన కవితా సంకలనం చదివితే ఆయన దృక్పథం, ఆలోచన తెలుస్తుందన్నారు. జగదీశ్వరి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందించి, వారి కాళ్లపై వారి నిలబడేలా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో 2019లో ట్రస్టు స్థాపించినట్లు తెలిపారు. తన భార్య జగదీశ్వరికి సాహిత్యం, సంగీతంపై ఎంతో మక్కువని, ఆమె జ్ఞాపకార్థం ప్రతి ఏటా విశిష్ట సాహితీవేత్తలకు జగదీశ్వరి పురస్కారం ప్రదానం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ రచయితల సంఘం అధ్యక్షుడు అడపా రామకృష్ణ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



కవి గోపికి పురస్కారం ప్రదానం చేస్తున్న హర్షవర్ధన్, రఘురామారావు

అసంపూర్తి పనులతో అవస్థలు



రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారిన గొయ్యి

పెదగంట్యాడ: మండలంలోని కోరాడ నుంచి సమతానగర్ వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఉన్న గొయ్యి కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాగునీటి పైపులైన్ల మరమ్మతుల నిమిత్తం దీనిని ఇటీవల తవ్వారు. తర్వాత దానిని పూర్తి స్థాయిలో కప్పకుండా వదిలేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. రాత్రి వేళల్లో వాహనచోదకులు అక్కడ గొయ్యిని గమనించకుండా రావడంతో అందులో పడి గాయాలపాలవుతున్నారు. దీనిపై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని స్థానికుడు విక్టర్ రాజు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.